నమస్తే తెలంగాణ

జగిత్యాల

5 | కరీంనగర్, సోమవారం 27 జనవరి 2025 | JAGTIAL


## రొంపికుంటలో రసాభాస

కమాన్‌పూర్, జనవరి 26: నాలుగు పథకాలకు సంబంధించి రొంపికుంట గ్రామంలో ఆదివారం ప్రొసీడింగ్స్ కాపీల పంపిణీ రసాభాసగా మారింది. మండల ప్రత్యేకాధికారి ప్రవీణ్‌రెడ్డి అధ్యక్షతన రైతు భరోసా మినహా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి 10 మంది చొప్పున మంజూరు పత్రాలను అందజేయగా, మిగిలిన వారికి ఎప్పుడు పంపిణీ చేస్తారంటూ గ్రామస్తులు, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ప్రశ్నించారు. ఎంపికైన వారి పేర్ల జాబితా ఈ సభలోనే చదివి వినిపించాలని పట్టుబట్టారు. కొద్దిసేపు గందరగోళ పరిస్థితి నెలకొన్నది. వేదిక ముందు కూర్చున్న కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్, బీజేపీ నాయకులతో వాగ్వాదానికి దిగారు. ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు ఇరు పక్షాల నాయకులను అక్కడి నుంచి పంపించారు. పనిలో పనిగా అధికారులు సభను ముగించేశారు.



కమాన్‌పూర్: రొంపికుంటలో ఘర్షణ పడుతున్న అధికార కాంగ్రెస్ – ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ నాయకులు

# రచ్చ రచ్చ గందరగోళం

- పైలెట్ గ్రామాల్లో పథకాల ప్రొసీడింగ్స్ కాపీల పంపిణీ రసాభాస
- రాత్రికి రాత్రే లబ్ధిదారుల పేర్ల తొలగింపుపై ప్రజాగ్రహం
- భగ్గుమన్న గ్రామస్తులు
- పథకాలు ఉన్నోళ్లకేనా అంటూ నిలదీతలు
- సమాధానం చెప్పలేక జారుకున్న అధికారులు

పైలెట్ గ్రామాల్లో ప్రభుత్వ పథకాల ప్రొసీడింగ్ కాపీల పంపిణీ రచ్చరచ్చగా మారింది. ప్రజాగ్రహం వెల్లువెత్తింది. రాత్రికి రాత్రే అర్హుల పేర్లు తొలగించి జాబితాలు తయారు చేశారంటూ ప్రజానీకం మండిపడింది. ఎక్కడ చూసినా నిరసనలతో అట్టుడికింది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మండలానికో పైలెట్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డుల మంజూరు పత్రాలు అందజేయగా, ప్రజలు ఎక్కడికక్కడ నిలదీశారు. తమ పేర్లు లేవని, అర్హుల ఎంపిక సరిగా జరగలేదంటూ విరుచుకుపడ్డారు. కొన్నిచోట్ల కన్నీరు పెడుతూ.. దండం పెడుతూ తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. పలుచోట్ల అధికార, ప్రతిపక్ష నాయకుల మధ్య మొదలైన మాటల యుద్ధం ఘర్షణకు దారి తీయగా, పోలీసులు అడ్డుకున్నారు.

- నమస్తే నెట్‌వర్క్, జనవరి 26



విట్టంపేటలో అధికారులు, కాంగ్రెస్ నాయకులను నిలదీస్తున్న గ్రామస్తుడు

### విట్టంపేటలో పేర్ల తొలగింపుపై లొల్లిలొల్లి

మెట్‌పల్లి రూరల్, జనవరి 26: మెట్‌పల్లి మండలంలోని విట్టంపేట గ్రామసభలో గందరగోళం నెలకొంది. రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావుతో కలిసి మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ మహేశ్వర్‌రెడ్డి లబ్ధిదారుల పేర్లను చదువుతూ మంజూరు పత్రాలు అందజేయగా, అర్హులను విస్మరించి అనర్హులకు పెద్దపీట వేశారంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు అన్ని అర్హతలున్నా ఇందిరమ్మ ఇల్లు, ఆత్మీయ భరోసా ఎందుకు రాలేదని ప్రశ్నించారు. మూడు రోజుల కింద పంచాయతీ కార్యాలయంలో ఉంచిన లబ్ధిదారుల జాబితాలో తమ పేర్లున్నాయని, ఇప్పుడెందుకు లేవంటూ ప్రశ్నించారు. రాత్రికి రాత్రే తమ పేర్లను తొలగించి తీరని అన్యాయం చేశారంటూ అధికారులు, కాంగ్రెస్ నాయకులను నిలదీశారు. కాగా, అర్హత ఉండి పథకాలు రాని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించడం విశేషం.

### 'గంద్రపల్లి'లో గొడవ

జమ్మికుంట, జనవరి26: ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, రైతు భరోసా పథకాల్లో అర్హులకు అన్యాయం జరిగిందంటూ జమ్మికుంట మండలం గంద్రపల్లి గ్రామస్తులు గొడవ చేశారు. ఆదివారం ప్రత్యేకాధికారి కిరణ్(డిప్యూటీ కలెక్టర్) ఆధ్వర్యంలో గ్రామసభను నిర్వహించగా, ఆత్మీయ భరోసా 34, రైతు భరోసా 537, రేషన్ కార్డులు 19, ఇందిరమ్మ ఇళ్లు 166 మంది అర్హులంటూ అధికారులు చదివి వినిపించారు. అందులో కూడా కేవలం ఒక్కో పథకం నుంచి ఐదుగురికి మాత్రమే ప్రొసీడింగ్‌లు అందజేశారు. ప్రకటించిన పథకాల్లో అర్హులు చాలా మంది ఉన్నారని, ఏ ప్రాతిపదికన పేర్లు ప్రకటించారని పలువురు అధికారులను నిలదీశారు. ఇందిరమ్మ ఇళ్లలో అర్హులైనవారి పేర్లు తొలగించారని ఆందోళనకు దిగే ప్రయత్నం చేశారు. ఆందోళనలను పోలీసులు అడ్డుకున్నారు. అధికారులు కలుగజేసుకొని, అర్హులందరికీ పథకాలు వర్తిస్తాయని, మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



'గంద్రపల్లి'లో అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్తుడు

### భగ్గుమన్న బద్దిపల్లి

కొత్తపల్లి, జనవరి 26 : బద్దిపల్లి గ్రామంలో ప్రొసీడింగ్స్ పంపిణీ నిరసనల మధ్య సాగింది. అర్హులకు కాకుండా కేవలం కాంగ్రెస్ నాయకులు చెప్పిన వారికే పథకాలు వర్తింప చేశారంటూ గ్రామస్తులు మండిపడ్డారు. అధికారులను నిలదీశారు. బీఆర్ఎస్ నాయకుడు ఉప్పు రాజశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం చెప్పినట్లు గ్రామంలో నాలుగు పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయాల్సి ఉండగా, కేవలం మొక్కుబడిగా కొంతమందికి మాత్రమే ప్రొసీడింగ్స్ అందజేశారని మండిపడ్డారు. ప్రభుత్వం చెప్పేదొకటి, చేసింది మరొకటని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### సంతకాలు లేకుండా మంజూరు పత్రాలు

పెద్దపల్లిరూరల్, జనవరి 26: నిమ్మనపల్లిలో లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ కాపీల పంపిణీ ఆగమాగం జరిగింది. అయితే, పలు మంజూరు పత్రాల్లో సంబంధిత మంత్రితోపాటు ముఖ్యమంత్రి సంతకం కాదు కదా.. కనీసం ఏ ఒక్క అధికారి సంతకం లేకపోవడంతో లబ్ధిదారులు విస్మయానికి గురయ్యారు. పథకాలు తమకు వచ్చినట్టా.. రానట్టా..? అని ఆలోచనలో పడిపోయారు. అయితే, కొందరు తమకు అర్హతలున్నా ఆత్మీయ భరోసా రాలేదని పలువురు మహిళలు, వృద్ధులు అధికారులను నిలదీశారు.

### రాత్రికి రాత్రే మాయం

ముత్తారం, జనవరి 26: పైలెట్ గ్రామం మచ్చుపేటలో రైతు భరోసా 328, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా 58, ఇందిరమ్మ ఇండ్లు 41, రేషన్ కార్డుల 88 మందికి ప్రొసీడింగ్స్ అందజేయగా, అనర్హులకే పెద్దపీట వేశారని అధికారులపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీలో గోడకు అంటించిన లిస్టులో తమ పేర్లు ఉన్నాయని, అయితే రాత్రికి రాత్రే తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు.

### ఎర్రాపూర్‌లో అధికారుల నిలదీత



కాంగ్రెస్ నాయకులతో వాగ్వాదం చేస్తున్న మహిళలు

ఇబ్రహీంపట్నం, జనవరి 26: ఎర్రాపూర్ గ్రామంలో ప్రొసీడింగ్ కాపీల పంపిణీ రసాభాసగా మారింది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఏడుగురికి, ఇందిరమ్మ ఇండ్లు 21 మందికి, రేషన్‌కార్డులు ఆరుగురికి, రైతు భరోసా 15 మందికి మాత్రమే పంపిణీ చేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరికీ ఇస్తామని చెప్పి ఇప్పుడు కొందరికే ఇవ్వడం ఏంటని అధికారులను ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులను నిలదీశారు.

### కొర్రీలు పెట్టి నా పొట్టకొట్టొద్దు..



ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో మాట్లాడుతున్న కొమ్ము లక్ష్మి

మానకొండూర్ రూరల్, జనవరి 26: 'సర్ నాది పేద కుటుంబం. కూలీ పనిచేస్తేనే పూటగడుస్తది. ఇయ్యాళ మా ఊళ్లే పథకాల మంజూరు పత్రాలు ఇస్తున్నరు గదా.. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో నా పేరు లేదు. ఎవ్వలెవ్వలియో..? వచ్చినయ్..? నా పేరెందుకు రాలేదో సారు..? అర్థమైతలేదు' అంటూ ముంజంపల్లి గ్రామానికి చెందిన కొమ్ము లక్ష్మి ఆదివారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో గోడు వెల్లబోసుకున్నది. ముంజంపల్లి గ్రామ సభలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు పథకాల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేసే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరు కాగా, లక్ష్మి కన్నీటి పర్యంతమైంది. 'ఉపాధి పనిలో 20 మస్టర్లు ఉంటేనే వస్తదట సర్, నేను ఉపాధి పనికి పోతే ఇల్లు గడువది. బయట పనికిపోత. ఇసోంటి కొర్రీలు పెట్టి నా పొట్టకొట్టొద్దు. నేను చేసుకుంటేనే బతుకుత' అంటూ వాపోయింది. అయితే, బయట పనికి పోతే కూడా ఈ స్కీమ్‌కు అర్హులయ్యేలా చూస్తామంటూ ఎమ్మెల్యే దాటవేశారు.

### నిరసనలు.. నిలదీతలు

కరీంనగర్‌రూరల్/ రుద్రంగి/ ముస్తాబాద్, జనవరి 26: కరీంనగర్ మండలం బహ్దూర్ ఖాన్ పేటలో లబ్ధిదారుల ఎంపిక సరిగ్గా జరుగలేదంటూ పలువురు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో అర్హులకు అన్యాయం జరిగింది అనర్హులకు పెద్దపీట వేశారని మహిళలు ఆరోపించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం గైదిగుట్టతండాలో ఇండ్లు ఉన్నోళ్లకే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశారని పలువురు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త రేషన్ కార్డుల మంజూరులో అర్హులకు అన్యాయం చేశారని విస్లవత్ గణేశ్ వాపోయాడు. ముస్తాబాద్ మండలం కొండాపూర్‌లో అర్హుల ఎంపిక సరిగ్గా జరుగలేదంటూ గ్రామానికి చెందిన యువకులు మండిపడ్డారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో తమకు అన్యాయం జరిగిందని వాపోయారు. వీణవంక మండలం శ్రీరాములపేట గ్రామంలో అధికారులు ప్రొసీడింగ్స్ అందజేయగా, పలువురు గ్రామస్తులు అభ్యంతరం చెప్పారు. అర్హులకు అన్యాయం జరిగిందని అధికారులను నిలదీశారు.

## మేయర్‌పై అవిశ్వాసానికి రంగం సిద్ధం?

- అవిశ్వాసానికి మద్దతు కార్పొరేటర్ల సంతకాలు
- నేడు కలెక్టర్‌కు నోటీసులు అందించనున్న కార్పొరేటర్లు

కరీంనగర్ కార్పొరేషన్, జనవరి 26 : కరీంనగర్ మేయర్ వై సునీల్‌రావుపై అవిశ్వాసం తీర్మానం ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు ఆ అవిశ్వాస నోటీసులపై ఇప్పటికే 31 మంది కార్పొరేటర్లు సంతకాలు చేసినట్లు అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ నోటీసులను సోమవారం ఉదయం కలెక్టర్‌కు అందించేందుకు బీఆర్ఎస్ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. నగర మేయర్ బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరడంపై బీఆర్ఎస్ సరికొత్త వ్యూహ్యాన్ని సిద్ధం చేసింది. ఆయనపై అసంతృప్తితో ఉన్న కార్పొరేటర్లను కలుపుకొని అవిశ్వాసాన్ని తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నది. ముఖ్యంగా ఈనెల 28తో పాలకవర్గ పదవీకాలం ముగిస్తున్నా ఉన్న రెండు రోజుల్లోనూ మేయర్‌పై కార్పొరేటర్లు, ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను చూపించేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే అవిశ్వాసానికి సంబంధించి కార్పొరేటర్ల సంతకాలు చేపట్టగా ఇప్పటికే 31 నుంచి 35 మంది మద్దతు ఇచ్చినట్లు తెలుస్తోంది. సోమవారం ఉదయం అధికారులకు నోటీసులు అందించే సమయానికి ఈ సంఖ్య మరింత పెరుగుతుందని బీఆర్ఎస్ భావిస్తోంది. మేయర్ బీజేపీలో చేరే సమయంలోనూ ఆయనతో పాటు పెద్ద సంఖ్యలో కార్పొరేటర్లు చేరుతారని ప్రచారం సాగినా, చివరకు ఇద్దరు మాత్రమే చేరారు. దీంతో మేయర్ తీరుపై అసంతృప్తితో ఉన్న కార్పొరేటర్లందరూ రెండు రోజులే గడువు ఉన్నా అవిశ్వాస నోటీసులు ఇవ్వాలని నిర్ణయించి ఇప్పటికే సంతకాలు చేసినట్లు తెలుస్తోంది. కాగా, కరీంనగర్ నగరపాలక సంస్థలో పాలకవర్గ పదవీకాలం ముగుస్తున్న సమయంలో చేపడుతున్న ఈ అవిశ్వాసంపై ఎలాంటి చర్చ సాగుతుందోనన్న ఆసక్తి నెలకొంది.



కరీంనగర్: ఆవిష్కరణ అనంతరం జాతీయజెండాకు వందనం చేస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్, కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ అభిషేక్ మొహంతి, ఎమ్మెల్యేలు, అధికారులు

# 'గణ'ంగా.. తిరంగా

- అంబరాన్నంటిన గణతంత్ర వేడుకలు
- ఊరూరా త్రివర్ణ పతాక రెపరెపలు
- జాతీయ పతాకాలను ఆవిష్కరించిన కలెక్టర్లు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



పోలీసుల నుంచిగౌరవ వందనం స్వీకరిస్తున్న రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్





జగిత్యాల: జెండా వందనం చేస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్, అధికారులు



కరీంనగర్: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్



జగిత్యాల కలెక్టరేట్, జనవరి 26: గణతంత్ర వేడుకలు ఆదివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా అంబరాన్నంటాయి. ఉదయం విద్యార్థుల ర్యాలీలు, ప్రదర్శనలు, జయ జయ నినాదాల నడుమ ఊరూరా సంబురాలు హోరెత్తాయి.. అనంతరం అంతటా మువ్వన్నెల జెండాలు రెపరెపలాడాయి.. కరీంనగర్, జగిత్యాల పోలీస్ పరేడ్ మైదానాలు, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి కలెక్టరేట్లలో కలెక్టర్లు పమేలా సత్పతి, సత్యప్రసాద్, సందీప్‌కుమార్ ఝా, కోయ శ్రీహర్ష జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. అంతకుముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. వివిధ శాఖల్లో సేవలందించిన అధికారులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఆయా కలెక్టరేట్లలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కరీంనగర్‌లో కలెక్టర్‌తోపాటు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, మానకొండూర్, చొప్పదండి ఎమ్మెల్యేలు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యంతో పాటు సీపీ అభిషేక్ మొహంతి స్వాతంత్ర్య సమరయోధులను ఘనంగా సన్మానించారు. అనంతరం పలు ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్ళను సందర్శించారు. కరీంనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం తీగలగుట్టపల్లిలోని కేసీఆర్ భవన్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆవిష్కరించగా, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు పాల్గొన్నారు. జగిత్యాలలో జరిగిన వేడుకల్లో విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, ఎస్పీ అశోక్‌కుమార్ పాల్గొన్నారు. పెద్దపల్లిలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లోని మహాత్మాగాంధీ స్టేడియంలో జరిగిన వేడుకలకు సీజీఎం చందన్‌కుమార్ సమంత, రామగుండం కమిషనరేట్‌లో సీపీ శ్రీనివాస్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. సిరిసిల్లలో జరిగిన వేడుకల్లో విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఎస్పీ అఖిల్ మహాజన్, ఏఎస్పీ చంద్రయ్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ పాల్గొన్నారు.



పెద్దపల్లి: మహిళా పోలీస్ బెటాలియన్ నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

## మున్సిపాలిటీలకు ప్రత్యేకాధికారులు

కరీంనగర్ కార్పొరేషన్, జనవరి 26 : మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం ముగియనుండడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆయా మున్సిపాలిటీలకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని మున్సిపాలిటీలకు ఆయా జిల్లాల లోకల్ బాడీ అదనపు కలెక్టర్లను ప్రత్యేకాధికారులుగా నియమించింది. కరీంనగర్ నగరపాలక సంస్థలో కొత్తపల్లి మున్సిపాలిటీని విలీనం చేయడంతో దానికి ప్రత్యేకాధికారిని నియమించలేదు. కరీంనగర్‌లోని చొప్పదండి, హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీలకు ప్రత్యేకాధికారిగా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) ప్రఫుల్ దేశాయ్, పెద్దపల్లి జిల్లాలోని పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలకు అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) జే అరుణశ్రీ, రామగుండం నగరపాలక సంస్థకు కలెక్టర్ కోయ శ్రీహర్ష, జగిత్యాల జిల్లాలోని జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్ మున్సిపాలిటీకు అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) గౌతమ్ రెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడకు అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) ఖీమ్యానాయక్‌కు బాధ్యతలు అప్పగించారు.

### 28తో ముగియనున్న కరీంనగర్ మున్సిపల్ పదవీ కాలం

కరీంనగర్ నగరపాలక సంస్థ పాలకవర్గం పదవీకాలం ఈ నెల 28తో ముగియనున్నది. దీంతో నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారిగా కలెక్టర్ పమేలా సత్పతికి బాధ్యతలు ఇచ్చారు.


